క్లుప్తంగా

కలెక్టర్‌కు వినతి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఖమ్మం సహకారనగర్: ఎన్నికల విధుల నుంచి కొన్ని కేటగిరిల వారికి మినహాయింపు ఇవ్వాలని పీఆర్‌టీయూ నాయకులు కలెక్టర్ వీపీ గౌతమ్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షులు మోతుకూరి మధు మాట్లాడుతూ... ఉద్యోగ విరమణకు ఆరు నెలల్లోపు ఉన్న వారిని, అంగవైకల్యం, అనారోగ్యంతో వైద్య చికిత్స పొందుతున్న వారిని, గర్భిణులకు మినహాయింపు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు కట్టా శేఖర్, యలమద్ది వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సివిల్ సప్లయీస్ గోడౌన్ ఇన్‌చార్జ్ బదిలీ

నేలకొండపల్లి: మండల కేంద్రంలోని సివిల్ సప్లయీస్ మండల లెవల్ స్టాక్ పాయింట్ గోడౌన్ ఇన్‌చార్జ్ లక్ష్మణ్ బదిలీ అయ్యారు. ఈ మేరకు లక్ష్మణ్‌ను కల్లూరు మండల లెవల్ స్టాక్ పాయింట్ ఇన్‌చార్జ్‌గా, అక్కడ పని చేస్తున్న ఇన్‌చార్జ్ ఖాజామొహినుద్దీన్‌ను నేలకొండపల్లికి బదిలీ చేశారు.

హోంగార్డుకు సన్మానం



హోంగార్డును సన్మానిస్తున్న సీపీ వారియర్

ఖమ్మంక్రైం: ఉద్యోగ విరమణ పొందిన హోంగార్డు భావన రూషిని సీపీ విష్ణు యస్ వారియర్ గురువారం ఘనంగా సన్మానించారు. సీపీ కార్యాలయంలో జరిగిన సన్మాన కార్యక్రమంలో సీపీ మాట్లాడుతూ... సుదీర్ఘ కాలంగా వివిధ విభాగాల్లో బాధ్యతాయుతమైన విధులు నిర్వహించి అధికారుల మన్ననలు పొందారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో హోంగార్డు ఆర్ఐ సురేష్, జిల్లా హోంగార్డ్ ఆఫీసర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు మహమ్మద్ రఫీ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వరిలో కాలిబాటలు తీయాలి

కామేపల్లి: వరిలో కాలిబాటలు తీయాలని మండల వ్యవసాయాధికారి భూక్యా తారాదేవి అన్నారు. గురువారం మండలంలోని కామేపల్లి, జాస్తిపల్లి, ముచ్చర్ల, లింగాల తదితర గ్రామాల్లో వరి పొలాలను పరిశీలించి రైతులకు పలు సూచనలు, సలహాలు చేశారు. పొట్ట దశలో ఉన్నందున యూ రియా వాడొద్దని, లద్దె, పచ్చ, రెక్కల పురుగు ఉధృతంగా ఉందని నివారణ చర్యలు చేపట్టాలన్నారు. నీరు నిల్వ లేకుండా ఆరుతడులు అందించాలని, గట్లపై గడ్డి లేకుండా చూడాలన్నారు.

మద్యం స్వాధీనం

కామేపల్లి: కామేపల్లి పంచాయతీలోని గోపాలపురం గ్రామంలో అక్రమంగా నిల్వ ఉంచిన రూ.2,500 విలువైన మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు. గురువారం దాడులు నిర్వహించగా గ్రామానికి చెందిన హట్కార్ చంద్రకళకు బెల్ట్ షాపులో నిల్వ ఉంచిన మద్యాన్ని స్వాధీనం చేసుకుని, ఆమెపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

నగరంలో సినిమాలు

తిరుమల	లియో
వినోద	భగవంత్ కేసరి
సాయిరాం	భగవంత్ కేసరి
ఆదిత్య	మ్యాడ్
శ్రీనివాస	టైగర్

- ఖమ్మంగాంధీచౌక్

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	30	బచ్చలికూర	2
వంకాయ	36		10
బెండకాయ	20	పాలకూర	3
పచ్చిమిర్చి	56		20
కాకర	24	చుక్కకూర	3
బోడ కాకర	100		20
బీర	36	తోటకూర	2
దొండ	24		10
పొట్లకాయ	30	గోంగూర	3
చిక్కుడు	60		10
గోరుచిక్కుడు	40	మెంతికూర	3
క్యాబేజీ	20		10
క్యాలీఫ్లవర్	28	కొత్తిమీర	1
ఆలుగడ్డ	26		20
చామగడ్డ	36	పుదీన	1
క్యారెట్	50		20
క్యాప్సికం	60	-ఖమ్మం వ్యవసాయం	

తరగతి గదులకే పరిమితం

అడవిగా మారిన కస్తూర్బా క్రీడామైదానం

- ఆటలకు దూరమవుతున్న విద్యార్థినులు
- వివాదాస్పదంగా మారిన భూమి
- అధికారులకు చెప్పినా పరిష్కారం కాని సమస్య



కంపచెట్లతో చిట్టడవిని తలపిస్తున్న క్రీడాప్రాంగణం

రఘునాథపాలెం: బాల్యంలోనే విద్యార్థులకు చదువుతోపాటు, క్రీడా పరంగా మంచి శిక్షణ అవసరం అంటారు. ఇరుకు గదుల్లో చదువులతో సరిపుచ్చుతూ సరైన మైదానం లేక క్రీడలపై ఆసక్తిలేకుండా చేస్తుంటే యువత రాణించేది ఎలా అని పలువురు ప్రశ్నగానే ఉంది. మండల కేంద్రమైన రఘునాథపాలెంలోని కస్తూర్బా బాలికల గురుకుల పాఠశాలకు క్రీడా మైదానం లేక విద్యార్థులకు ఆటలకు దూరం కావాల్సి వస్తోంది. 300 మందిపైగా విద్యార్థినులు తరగతి గదులకే పరిమితం కావాల్సి వస్తుంది.

అడవిని తలపిస్తున్న మైదానం..

గతేడాది పాఠశాల ఎదురుగా ఉన్న మూడు ఎకరాల భూమిని పాఠశాల క్రీడా మైదానానికి కేటాయించారు. అప్పట్లో అధికారులు ఆగమేఘాలపై ఆభూమిని చదును చేసి క్రీడా మైదానం కస్తూర్బా పాఠశాల అంటూ పెద్ద బోర్డులను ఏర్పాటు చేసి దాంట్లో క్రీడలకు ఉపయోగపడే రెండు మూడు రకాల పరికరాలు అమర్చారు. అంతే అక్కడ ఎలాంటి ఆటలు ఆడకుండానే వేలాది రూపాయలతో అభివృద్ధి చేసిన మైదానం నేడు అడవిగా మారి దర్శనమిస్తుంది. ఇక్కడ ఒక క్రీడా మైదానం ఉండాలనే అనే విధంగా ప్రాంగణం మొత్తం కంపచెట్లు పెరిగి చిన్నపాటి అడవిని తలపిస్తుంది.

భూమి తమదంటూ రైతుల దాడి..

గతేడాది ఆమైదానంలో క్రీడలు ఆడించడానికి విద్యార్థినులకు తీసుకెళ్లిన పాఠశాల పీఈటి, ఉపాధ్యాయులతో ఆభూమి తమదంటూ కొంతమంది రైతులు అభ్యంతరం వ్యక్తం చేయడంతోపాటు, దాడికి దిగారని పాఠశాల ఎస్ఓ అప్పటిలో పోలీసు కేసు సైతం పెట్టారు. అంతే అప్పటి నుంచి విద్యార్థినులు గాని, ఉపాధ్యాయులు గాని అటువైపు కన్నెత్తి చూడలేదు. కొన్ని మాసాలు క్రితం పాఠశాలలో అదనపు గదులు నిర్మాణానికి శంకుస్థాపనకు వచ్చిన కలెక్టర్‌కు పాఠశాల ఎస్ఓతోపాటు, ఉపాధ్యాయులు క్రీడా మైదానం లేక ఇబ్బంది జరుగుతుందని, ఎదురుగా కేటాయించిన భూమి వివాదస్పదంగా ఉందని చెప్పారు. అక్కడే ఉన్న అప్పటి తహసీల్దార్ నరిసింహారావు, ఎంపీడీఓ రామకృష్ణలు తాము దగ్గిర ఉండి పంచనామా చేసి స్థలం అప్పగించామని ఇప్పుడు అలాంటి సమస్యలేదని వివరణ ఇచ్చారు. అంతే తర్వాత దాన్ని గురించి పట్టించుకున్న నాథుడే లేరు.

కొద్దిపాటి ఆవరణలోనే అవస్థలు..

వందలాదిమంది విద్యార్థినులు ఉన్న పాఠశాలకు సరైన క్రీడా మైదానం లేకపోవడంతో విద్యార్థినులు ఉన్న కొద్ది పాటి పాఠశాల ఆవరణంలోనే ఆటలు ఆడుతూ అవస్థలు పడుతున్నారు. అభివృద్ధి చేసిన క్రీడా మైదానం మాత్రం ఆనమాళ్లు లేకుండానే పోయిందని, ఇప్పటికైనా అధికారులు క్రీడా మైదానం కోసం కేటాయించిన భూమిలో ఏర్పాటు చేసిన ఆట వస్తువుల్లో విద్యార్థులు ఆటలాడే విధంగా చర్యలు తీసుకుని క్రీడా పరంగా ప్రోత్సహించాలని విద్యార్థినులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.



క్రీడా మైదానం ముఖద్వారం

భూమి మాదంటూ దాడికి దిగారు..

వందలాదిమంది విద్యార్థినులు ఉన్న పాఠశాలకు సరిపడా క్రీడా మైదానం లేకపోవడం ఇబ్బందిగానే ఉంది. గతంలో పాఠశాలకు ఎదురుగా మూడు ఎకరాలు కేటాయించి మైదానం అభివృద్ధి చేశారు. అది వివాదస్పదంగా మారింది. విద్యార్థినులను ఆటలాడించేందుకు వెళ్లిన తమ ఉపాధ్యాయులపై కొంతమంది ఇది తమ భూమి అంటూ దాడికి దిగారు. ఈ విషయంపై పోలీసు కేసు కూడా పెట్టాం, ప్రస్తుతం అది కంపచెట్లు పెరిగి భయంకరంగా మారింది. ప్రస్తుతం పాఠశాలలోనే ఉన్న కొద్ది ఖాళీ స్థలంలో ఆటలు ఆడిస్తున్నాం.

– వై.లత, పాఠశాల ఎస్ఓ

బెదిరింపులకు భయపడేది లేదు..



కూసుమంచి: మాట్లాడుతున్న ప్రసాదరెడ్డి



ఖమ్మంరూరల్: హర్షారెడ్డికి హారతి ఇస్తున్న మహిళలు

కూసుమంచి: బీఆర్‌ఎస్ నాయకుల బెదిరింపులకు భయపడొద్దని, కార్యకర్తలకు కాంగ్రెస్ అండగా ఉంటుందని పార్టీ నాయకులు పొంగులేటి ప్రసాదరెడ్డి అన్నారు. గురువారం కూసుమంచిలోని ఎన్నికల కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ నాయకులు డబ్బు సంచులతో వస్తూ పార్టీలోకి బలవంతంగా చేర్చుకుంటున్నారని, కొందరిని బెదిరిస్తున్నారన్నారు. గడపగడపకు కాంగ్రెస్ కార్యక్రమంలో ఎన్నో సమస్యలను తన దృష్టికి ప్రజలు తీసుకొచ్చారని, మరి అభివృద్ధి చేస్తే సమస్యలు ఎలా మిగిలాయని ప్రశ్నించారు. అంతకు ముందు నాయకన్‌గూడెంలో పలువురు ప్రసాదరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరగా వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సమావేశంలో పార్టీ నాయకురాలు మద్దినేని బేబీ స్వర్ణకుమారి, మాజీ ఎంపీపీ ఎడవెల్లి ముత్తయ్య, ఎంపీటీసీ మాదాసు ఉపేందర్, సర్పంచ్‌లు ఖాదర్‌బాబు, సూర్యనారాయణరెడ్డి, చెన్నా మోహన్, నాయకులు హఫీజుద్దీన్, జొన్నలగడ్డ రవికుమార్, అహ్మద్ ఆలీ, సెట్రాం నాయక్, సుధాకర్‌రెడ్డి, లెనిన్, రాంరెడ్డి, దామోదర్‌రెడ్డి, వెంకటరెడ్డి, వీరభద్రం, బాసూనాయక్, శ్రీనివాస్, జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

అదేవిధంగా తెలంగాణా కాంగ్రెస్ ప్రచార కమిటీ కో–చైర్మన్ పొంగులేటి శ్రీనివాసరెడ్డి తనయుడు శ్రీహర్ష రెడ్డి గురువారం కూసుమంచిలో ప్రచారం చేపట్టారు. తొలుత స్థానిక శివాలయంలో పూజలు నిర్వహించారు.

ఖమ్మంరూరల్: మండలంలోని పొన్నెకల్‌లో పొంగులేటి ప్రసాద్‌రెడ్డి, తీర్థాలలో పొంగులేటి శ్రీనివాసరెడ్డి తనయుడు శ్రీహర్షరెడ్డి ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీ పథకాలను గడపగడపకు వెళ్లి వివరించారు.

అథ్లెటిక్స్ మీట్‌లో విద్యార్థి ప్రతిభ



విద్యార్థిని అభినందిస్తున్న యాజమాన్యం

ఖమ్మంస్పోర్ట్స్: నగరంలోని కవిత మెమోరియల్ డిగ్రీ కళాశాల విద్యార్థి ఎ.గౌతమ్ ఇటీవల వరంగల్లో జరిగిన సౌత్ జోన్ జాతీయ స్థాయి అథ్లెటిక్స్ మీట్‌లో ప్రతిభ కనబర్చాడు. ఈ మేరకు గురువారం విద్యార్థిని అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 100 మీటర్ల పరుగులో రజతం, 200 మీటర్ల పరుగులో కాంస్యం, 4×100 రిలేలో కాంస్య పతకం సాధించాడన్నారు. అభినందించిన వారిలో కరస్పాండెంట్ అండ్ సెక్రటరీ కోట అప్పిరెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ కెవి రమణ, పీడీ జే. ఉపేందర్, కల్పన తదితరులు ఉన్నారు.

బీఎస్పీతోనే మార్పు సాధ్యం

నేలకొండపల్లి: రానున్న ఎన్నికల్లో ప్రజలు మార్పు కోరుకుంటున్నారని ఆ మార్పు బీఎస్పీతోనే సాధ్యమని పాలేరు బీఎస్పీ అభ్యర్థి డాక్టర్ అల్లిక వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని ఆచార్లగూడెం, ఆరెగూడెం, కోనాయిగూడెం తదితర గ్రామాల్లో గురువారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాలేరులో గెలిచిన వారంతా ప్రజలను ఇబ్బందులకు గురి చేశారని, తనను ఆశీర్వదించాలని కోరారు.

నేడు ఎమ్మెల్యే హరిప్రియ పర్యటన

కామేపల్లి: అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా కామేపల్లిలో శుక్రవారం ఇల్లెందు ఎమ్మెల్యే బానోత్ హరిప్రియా ప్రచారం నిర్వహించనున్నట్లు బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు ధనియాకుల హన్మంతరావు అన్నారు. గురువారం పండితాపురం గ్రామంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మండలంలోని మద్దులపల్లి, లాల్యతండ, జగన్నాథతండా, బాసిత్‌నగర్, సాతానిగూడెం గ్రామాల్లో ప్రచారం నిర్వహించనున్నట్లు తెలిపారు.

అభివృద్ధి చేసేందుకే ప్రజా ప్రతినిధులు

ఖమ్మంమయూరిసెంటర్: ప్రజాప్రతినిధులు ఉన్నది ప్లాట్ల పంచాయతీలు చేసేందుకు కాదని, ప్రజల అభివృద్ధి కోసం పాటుపడేందుకు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు వారి దరిచేర్చేందుకు ఉన్నారని బీఆర్‌ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు అన్నారు. గురువారం బీఆర్‌ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... మంత్రి పువ్వాడ తనకు సంబంధించి ప్లాట్ల పంచాయతీకి రాలేదని చావా నారాయణ అనడం అర్థరహితమన్నారు. మంత్రి పువ్వాడపై వ్యాఖ్యలు చేసే స్థాయి కాంగ్రెస్ నాయకులకు లేదన్నారు. వ్యక్తిగత దూషణలకు దిగడం వారి దిగజారుడుతనానికి అర్థంపడుతుందన్నారు. నాయకులు మేకల సుగుణారావు, తాజుద్దీన్, షకీనా తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమంపై హామీ ఇవ్వాలి



మాట్లాడుతున్న బి.జి.క్లెమెంట్

ఖమ్మంమయూరిసెంటర్: త్వరలో జరగబోతున్న ఎన్నికల్లో రాజకీయ పార్టీలు కార్మికుల సంక్షేమంపై స్పష్టమైన హామీలు ఇవ్వాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి.జి.క్లెమెంట్ డిమాండ్ చేశారు. గురువారం ఏఐటీయూసీ కార్యాలయంలో జరిగిన జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గతంలో జరిగిన ఏ ఎన్నికల్లోనూ కార్మికుల సమస్యల పరిష్కారానికి స్పష్టమైన హామీ ఇవ్వలేదన్నారు. ఒకవైపు చాలీచాలని జీతంతో మరోవైపు పెరుగుతున్న నిత్యవసర ధరల మధ్యలో ఒత్తిడికి గురై తీవ్ర ఇబ్బందులు చవిచూడాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. కార్మిక వ్యతిరేక కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను ఓడించాలని పిలుపునిచ్చారు. ఇందు కోసం ప్రతీ కార్మికుడు పాటుపడాలని కోరారు. ఈనెల 31న నగరంలోని రోటరీనగర్‌లో నిర్వహించే ఏఐటీయూసీ ఆవిర్భావ వేడుకలకు అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గాదె లక్ష్మీనారాయణ, తోట రామాంజనేయులు, ఉపాధ్యక్షులు ఎండి జాకీరుద్దీన్, పేరబోయిన మోహన్‌రావు, గారపాటి అశోక్, కార్యదర్శులు సిహెచ్.సీతామహాలక్ష్మి, పిల్లి రమేష్, గుండె పొంగు మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

'ఆరు గ్యారంటీ'లపై ప్రచారం చేయాలి

నేలకొండపల్లి: కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా ప్రచారం చేయాలని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శాఖమూరి రమేష్ అన్నారు. మండలంలోని కోనాయిగూడెంలో గురువారం పార్టీ ముఖ్యకార్యకర్తల సమావేశం గ్రామశాఖ అధ్యక్షుడు కొచ్చెర్ల శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాలేరు కాంగ్రెస్ అడ్డా అని, రానున్న ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపించాలని సూచించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే చేపట్టనున్న పథకాల గురించి ప్రజలకు తెలియజేయాలన్నారు. బీఆర్‌ఎస్ మాయమాటలు ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పెంటమళ్ల పుల్లమ్మ, నాయకులు నెల్లూరి భద్రయ్య, కుక్కల హనుమంతరావు, మామిడి వెంకన్న, జంగం లక్ష్మీనారాయణ, కొచ్చెర్ల నాగేశ్వరరావు, పాకనాటి కన్నారెడ్డి, వడ్లమూడి శ్రీనివాసరావు, మేకల పేరయ్య తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు



తనిఖీ చేస్తున్న తహసీల్దార్ రామ్‌ప్రసాద్

తిరుమలాయపాలెం: మండలంలోని సుబ్లేడు క్రాస్ రోడ్డు వద్ద ఏర్పాటు చేసిన అంతర్ జిల్లా చెక్‌పోస్టు వద్ద వాహన తనిఖీలను ముమ్మరం చేశారు. గురువారం వాహన తనిఖీ కార్యక్రమాన్ని తహసీల్దార్ పి.రామ్‌ప్రసాద్ పరిశీలించారు. ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, ప్రతీ వాహనాన్ని రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు. మద్యం, నగదు అక్రమ రవాణాను అరికట్టాలని తెలిపారు.

మార్కెట్‌ను తరలించాలని చూడలేదా?

- పాలేరు ప్రజలు ఛీదరిస్తే మళ్లీ ఖమ్మం వచ్చారు
- మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్



మాట్లాడుతున్న మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్

ఖమ్మంమయూరిసెంటర్: వ్యవసాయ మార్కెట్‌ను ఖమ్మంలోని త్రీటౌన్ ప్రాంతం నుండి తరలించేందుకు నాడు ప్రయత్నించలేదా అని రాష్ట్ర రవాణ శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును ప్రశ్నించారు. ఖమ్మంలోని 33వ డివిజన్‌లో గురువారం గీతా వెంకన్న ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి పువ్వాడ మాట్లాడుతూ మార్కెట్ తరలించాలని చూసి, ఆ నిందను తనపై వేశాడన్నారు. అయితే, తన ప్రాణం ఉన్నంత కాలం మార్కెట్‌ను తరలించేందుకు అంగీకరించేది లేదని అప్పట్లో స్పష్టం చేశానని పేర్కొన్నారు. పాలేరులో పోటీ చేస్తానన్న వ్యక్తి ఇప్పుడు ఇక్కడ పోటీకి వచ్చాడంటేనే పరిస్థితి అర్థమవుతోందన్నారు. ఇంటింటికీ మంచినీళ్లు ఇచ్చామని చెప్పుకుంటున్న తుమ్మల ఆయన ఇంటి నుండి ఇచ్చారా అని ప్రశ్నించారు. సీఎం కేసీఆర్ ప్రజాధనంతో మిషన్ భగీరథ స్కీంను తీసుకొచ్చి నీటిని ఇస్తున్నారని తెలిపారు. ఆయన తీరును ఖమ్మం ప్రజలు ఛీదరించి ఓడిస్తే పాలేరు వెళ్లాడని, అక్కడా తిరస్కరించడంతో మళ్లీ ఖమ్మం వచ్చాడని చెప్పారు. ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, డీసీసీబీ, మార్కెట్ చైర్మన్లు కూరాకుల నాగభూషణం, దోరేపల్లి శ్వేత, వర్తక సంఘం అధ్యక్ష, కార్యదర్శులు చిన్ని కృష్ణరావు, మెంతుల శ్రీశైలంతోపాటు మలిశెట్టి వెంకటేశ్వర్లు, పారా నాగేశ్వరరావు, సోమ నరేష్, వేములపల్లి వెంకన్న తదితరులు పాల్గొన్నారు. అలాగే, 29వ డివిజన్ సుందరయ్య నగర్‌లో గ్రానైట్ సంఘం జిల్లా నాయకుడు పారా నాగేశ్వరరావు అధ్యక్షతన, శ్రీరక్షా ఆస్పత్రిలో డాక్టర గొంగుర వెంకటేశ్వర్లు ఆధ్వర్యాన జరిగిన సమ్మేళనాలతో పాటు బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన టూటౌన్ పరిధిలోని డివిజన్ల బూత్ లెవల్ కమిటీ సమావేశంలో పువ్వాడ మాట్లాడారు. బీఆర్‌ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

రఘునాథపాలెం మండలంలో...

రఘునాథపాలెం: రఘునాథపాలెం మండలంలోని పలు గ్రామాల్లో గురువారం మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ పర్యటించారు. బూడిదంపాడులో బీఆర్‌ఎస్ నాయకుడు కేలోత్ బాసు తల్లి మన్ని మృతి చెందగా నివాళులర్పించారు. అలాగే, ఇటీవలే మృతి చెందిన గుంపుల లక్ష్మయ్య కుటుంబీలను పరామర్శించారు. సర్పంచ్ మీరా సాహెబ్, నాయకుడు మందడపు నర్సింహారావు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి, సంక్షేమం



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే ఉపేందర్‌రెడ్డి

కూసుమంచి: అభివృద్ధి, సంక్షేమం బీఆర్‌ఎస్‌కే సాధ్యమని, ప్రజలు మరో మారు ఆశీర్వదించాలని ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని లాల్‌సింగ్‌తండా సర్పంచ్ ధారవత్ వెంకట్, ఉప సర్పంచ్ నీరజతో పాటు పలువురు వార్డు సభ్యులు గురువారం ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి ఎమ్మెల్యే పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఎంపీపీ బాణోత్ శ్రీనివాస్ నాయక్, డీసీసీబీ డైరక్టర్ ఇంటూరి శేఖర్, ఆత్మా కమిటీ చైర్మన్ బాలకృష్ణారెడ్డి, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు వేముల వీరయ్య, రైతు బంధు కన్వీనర్ రాంకుమార్, సర్పంచ్ శ్యాంసుందర్‌రెడ్డి, ఎంపీటీసీ బదావత్ మంగ్యా ఉన్నారు.

గుండెల్లో పెట్టుకుని చూసుకునే బాధ్యత నాదే..



మాట్లాడుతున్న మాజీ మంత్రి నాగేశ్వరరావు

ఖమ్మంవన్‌టౌన్: వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని, ఆతర్వాత అందరిని గుండెల్లో పెట్టుకుని చూసుకునే బాధ్యత తనదేనని మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఖమ్మంలోని 25, 29, 32, 33, 43వ డివిజన్లలో గురువారం జరిగిన ఆత్మీయ సమ్మేళనాల్లో ఆయన మాట్లాడారు. ఖమ్మం వన్‌టౌన్, త్రీటౌన్ ఏరియాలలో గతంలో నీటిఎద్దడి ఉండగా, తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు సమస్య సమస్యను తీర్చారన్నారు. ప్రకాష్‌నగర్ బ్రిడ్జి చర్చి కాంపౌండ్ బ్రిడ్జిలను తానే తీసుకొచ్చానని తెలిపారు. ఆతర్వాత మల్లంపల్లి సుధాకర్, చావా ప్రసాద్, నున్నా లక్ష్మీనారాయణ, మలీదు సత్యనారాయణ, రాందేని నరేష్ తదితరులను తుమ్మల కలిసి మద్దతు కోరారు. కాంగ్రెస్ నాయకులు వడ్డెబోయిన నర్సింహారావు, రాయల నాగేశ్వరరావు, మిక్కిలినేని నరేందర్, కమర్తపు మురళీ, చావా నారాయణరావు, సాధు రమేష్‌రెడ్డి, కొప్పెర ఉపేందర్, జంగం భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

అరాచక పాలనకు అంతం పలకాలి

ఖమ్మంఅర్బన్: అరాచకపాలన అంతం చేయడానికి కాంగ్రెస్ శ్రేణులు కథం తొక్కాలని మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. ఖమ్మం 8వ డివిజన్ వైఎస్‌ఆర్ నగర్‌లో ఇంటింటికీ కాంగ్రెస్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అధికారం అడ్డుపెట్టుకొని పోలీసులను ప్రైవేట్ సైన్యంలా మార్చారని ఆరోపించారు. ఇకనైనా పోలీస్ అధికారులు తీరు మార్చుకోవాలని సూచించారు. అనంతరం 14వ డివిజన్‌లో జరిగిన సమావేశంలో తుమ్మల మాట్లాడుతూ గన్‌మెన్లతో వచ్చి రాత్రిళ్లు కాంగ్రెస్ నేతలను బెదిరించిన వారిపై పోలీసు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. ఒక పోలీస్ అధికారి వలంటరీ రిటైర్మెంట్ తీసుకుని బీఆర్‌ఎస్ నేతలకు అనుకూలంగా పనిచేస్తున్నాడని ఆరోపించారు. అనంతరం పలువురు కాంగ్రెస్‌లో చేరగా వారికి తుమ్మల పార్టీ కండువాలు కప్పి స్వాగతించారు. డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, నాయకులు జావిద్, దొబ్బల సౌజన్య, లకావత్ సైదులు, మలీదు వెంకటేశ్వర్లు, చావా నారాయణరావు, పోట్ల వీరేందర్, కమర్తపు మురళి పాల్గొన్నారు. కాగా, రఘునాథపాలెం మండలం కోటపాడులో కాంగ్రెస్ నగర అధ్యక్షుడు జావీద్, తుమ్మల తనయుడు యుగంధర్ ఆధ్వర్యాన ప్రచారం చేశారు. అలాగే, ఈర్లపుడి వార్డు సభ్యుడు ధరావత్ పెద్దమంగ్యా తుమ్మల నాగేశ్వరరావు సమక్షాన కాంగ్రెస్‌లో చేరారు.

పువ్వాడకు హ్యాట్రిక్ విజయం అందించండి



కవల పిల్లలను లాలిస్తున్న వసంతలక్ష్మి

ఖమ్మంమయూరిసెంటర్: బీఆర్‌ఎస్ అభ్యర్థిగా ఖమ్మం నుండి పోటీ చేస్తున్న పువ్వాడ అజయ్‌కుమార్‌ను మరోసారి గెలిపించి హ్యాట్రిక్ విజయాన్ని అందించాలని ఆయన సతీమణి వసంతలక్ష్మి కోరారు. నగరంలోని 17వ డివిజన్‌లో గురువారం ఆమె ఇంటింటి ప్రచారం చేసి మాట్లాడారు. ఖమ్మంను అన్నిరంగాల్లో అభివృద్ధి చేయడమే కాక సంక్షేమ పథకాలను ఇంటింటికీ అందించిన ఘనత పువ్వాడ అజయ్‌కుమార్‌కే దక్కుతుందన్నారు. మేయర్ పునుకొల్లు నీరజ, కార్పొరేటర్ ధనాల రాధ, నాయకులు ధనాల శ్రీకాంత్, వడ్డెల్లి లెనిన్, వి.వెంకటనారాయణ, వై.ఉమాపతి, నర్సయ్య, వెంకన్న, నాగరాజు, మనోహర్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ సమావేశం కరపత్రాలు ఆవిష్కరణ

ఖమ్మం మామిళ్లగూడెం: డిసెంబర్ 1న ఖమ్మం ఒయాసిస్ ఫంక్షన్‌హాలులో నిర్వహించే ఉమ్మడి ఖమ్మం జిల్లా తెలంగాణ ఉద్యమకారుల ఆత్మీయ సమావేశ కరపత్రాలను గురువారం ఖమ్మంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ కృష్ణారావు మాట్లాడుతూ.. సాధించుకున్న తెలంగాణలో అవినీతి పెచ్చు మీరిందన్నారు. స్టేట్‌ను కానుకగా ఇచ్చిన కాంగ్రెస్ పార్టీని తిరిగి అధికారంలోకి తీసుకురావాలన్నారు. ఈ సమావేశానికి అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ గోపగాని శంకర్‌రావు, అర్వపల్లి విద్యాసాగర్, వీరభద్రం, శ్రీనివాస్, మస్తాన్, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న దృశ్యం

తోపుడుబండ్ల నిర్వాహకులను ఆదుకోవాలి

ఖమ్మంరాపర్తినగర్: జిల్లా కేంద్రంలో పలు ప్రాంతాల్లో తోపుడు బండ్లపై ఇడ్లీలు, పునుగులు, పానీ పూరీలు, దోశలు, మిర్చి బజ్జీలు అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్న ఇడ్లీ గరం బండ్ల నిర్వాహకులను ఆదుకోవాలని ఖమ్మం నగర ఇడ్లీ గరం బండ్ల యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు బోడా వీరన్న, ఉప్పునూతల రమణాచారి డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ఎఫ్‌సీఐ గోడౌన్ వద్ద గల మేకల భిక్షమయ్య ఫంక్షన్ హాల్‌లో యూనియన్ జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎండి.హిమాం, నాయకులు మందా వెంకటేశ్వర్లు, గాదె లక్ష్మీనారాయణ, యూనియన్ గౌరవ సలహాదారులు యోబు, కోశాధికారి భూక్యా రామక్రిష్ణ, సహాయ కార్యదర్శి ఆడెపు ఆనంద్, ఉపాధ్యక్షుడు బోడా రమేష్, ఆర్గనైజింగ్ కార్యదర్శులు పాలపాటి శ్రీను, బొమ్మగాని వేణు, కమిటీ సభ్యులు భుక్యా కమిలి, ఆడెపు సుమన్, లలిత, విజయ, రమాదేవి, జి.రాంబాబు, విజయ్, పెద్ద రాము, చిన్న రాము, ఉపేందర్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాయకులు